**మే 21–** మధ్యాహ్నం శివరాజన్ జయకుమార్ యింట్లో కుర్తా, పైజమా వేసుకుని వేషం ఎలా వుందో చూసుకున్నాడు. థాను, శుభా లను వెంటపెట్టుకుని విల్లివాకం హైకోర్టు కాలనీలోని నళిని యింటికి బయలుదేరాడు. థాను ఆరంజ్ కలర్ సల్వార్ కమీజ్ వేసుకుని, పైన ఆకుపచ్చ దుపట్టా (ఓణి) వేసుకుంది. అంతకుముందే ఫోటోగ్రాఫర్ హరిబాబు యింట్లోంచి బయలుదేరి ఫోటోగ్రాఫర్ శుభాసుందరాన్ని కలిశాడు. అతని దగ్గర్నుంచి సూచనలు తీసుకున్నాడు. అక్కణ్నుంచి పారిస్ కార్నర్‌కు వెళ్లి అక్కడ పూంపుహార్ అనే హేండిక్రాఫ్ట్స్ షో రూములో 65 రూ.లు పెట్టి ఒక చందనమాల కొన్నాడు. రశీదు కూడా తీసుకున్నాడు. ఇంటికి వచ్చి దాన్ని యింట్లో పడేసి మళ్లీ పారిస్ కార్నర్‌కు వెళ్లి శివరాజన్ ముఠాకోసం వెయిట్ చేశాడు. (మాల కొని అటునుంచి అటే వాళ్లతో వెళ్లిపోయి వుంటే ఆ రసీదు హరిబాబు యింటిపై సిట్‌వాళ్లు దాడి చేసినప్పుడు దొరికేది కాదు. అది చూడగానే వాళ్లకు ఫ్లాష్ వెలిగింది. రాజీవ్‌ను చంపిన మానవబాంబు చేతిలో చందనమాల వుంది కదా అని. హరిబాబుకు ఎల్‌టిటిఇకి సంబంధం వుందనే కోణంలో పరిశోధన ముందుకు సాగింది)

నళిని అవేళ మధ్యాహ్నం ఆఫీసుకి సెలవు పెట్టేసి యింటికి చేరింది. సాయంత్రం 4.30 కు శివరాజన్, థాను, శుభలతో కలిసి పారిస్ కార్నర్‌కు బయలుదేరింది. మురుగన్ వాళ్లతో కాస్త దూరం వచ్చాడు. ఇంతమంది యిలా వెళ్లడం వాళ్ల యింటి పక్కనున్న వాళ్ల కంటపడింది. రాజీవ్ హత్య తర్వాత సల్వార్ కమీజ్ హంతకి, కుర్తా పైజమా మనిషీ వున్న ఫోటో పేపర్లో వేయడంతో ఆ యింటి పక్కాయన మే 30 న సిట్ వాళ్ల దగ్గరకు వచ్చి మే 21 న వాళ్లంతా కలిసి బయటకు వెళుతూంటే మా ఆవిడ చూసింది అని చెప్పాడు. మే 26 నుండి నళిని కనిపించకుండా పోయిందని చెప్పడంతో సిట్ వాళ్లకు సందేహం వచ్చింది.

అప్పటిదాకా వాళ్లకు నళినిపై అనుమానం లేదు. ఈయన చెప్పిన తర్వాతనే రాజీవ్ సభ ఫోటోలు తెప్పించి చూస్తే ప్రేక్షకులలో నళిని కనబడింది. ఆ ఫోటోలు చూసిన ఒక సిట్ అధికారి తెల్లబోయాడు. "రాయపేటలో భాగ్యనాథన్ యింట్లో యీ అమ్మాయిని చూశాను సార్. వాళ్ల అక్కట. విల్లివాక్కంలో ఎలా వుంది? అనుమానించడానికి ఆధారాలు లేవు కదాని ఆమెను ఇంటరాగేట్ చేయలేదు." అన్నాడు. ఈ పక్కింటాయన చెప్పిన సమాచారం మీదనే నళినిపై అనుమానం బలపడి, వలవేసి పట్టుకుని సమాచారం లాగగలిగారు సిట్ వాళ్లు.

వీళ్లు పారిస్ కార్నర్ చేరేసరికి అక్కడ హరిబాబు ఓ చేత్తో కెమెరా, మరో చేత్తో చందనమాల పట్టుకుని వెయిట్ చేస్తున్నాడు. అయిదుగురు కలిసి శ్రీ పెరంబుదూర్ బస్సెక్కారు. వాళ్లు బస్సు దిగేసరికి 7.30 అయింది.

తనను మట్టుపెట్టడానికి కొందరు యిలా తయారవుతూంటే అది తెలియని రాజీవ్ గాంధీ తన పాటికి తను తమిళనాడు వస్తున్నాడు. 20 వ తారీకు యుపిలో ప్రచారసభలు నిర్వహించుకుని రాత్రికల్లా ఒడిశాలోని భువనేశ్వర్ చేరి అక్కడ పెద్ద బహిరంగసభలో పాల్గొని 21 పొద్దున్న కాస్త ఆలస్యంగా 7.30 కి నిద్ర లేచాడు. ఇక అక్కణ్నుంచి కింగ్ ఎయిర్ క్రాఫ్ట్‌లో ఒడిశాలోని భద్రక్, అంగుల్, పర్లాఖిమిడి, గుణపూర్ చూసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం వచ్చాడు. అక్కడ, విజయనగరం, విశాఖపట్టణంలలో సభలు ముగించుకున్నాడు. అక్కణ్నుంచి మద్రాసుకి బయలుదేరుతూండగా విమానంలోని కమ్యూనికేషన్ సిస్టమ్ పనిచేయడం లేదని కెప్టెన్ చందోక్ చెప్పాడు. రాజీవ్ కూడా ఒకప్పుడు పైలటేగా. దానిదేముంది, పద సరిచేద్దాం అంటూ రాజీవ్ కూడా అతనితో కుస్తీ పట్టాడు. లాభం లేకపోయింది.

"ఇక యీ రాత్రి యిక్కడ వుండక తప్పేట్టు లేదు" అన్నాడు కెప్టెన్. అక్కడ పెరంబుదూర్‌లో చాలామంది వేచి వుంటారని తెలిసినా చేసేదేమీ లేక రాజీవ్ విమానం దిగి వైజాగ్ సిటీకి వెళ్లిపోయాడు. అతనితో బాటు అతని మీడియా సలహాదారు సుమన్ దూబే, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ ఓ పి సాగర్, యిద్దరు బల్గేరియా జర్నలిస్టులు. వాళ్లు వెళ్లిన కాస్సేపటికి పైలెట్ ఓ స్విచ్ మార్చి చూస్తే పని చేసింది. క్షణాల్లో రాజీవ్‌కి చెప్పారు. వెంటనే ఆయన బయలుదేరి వచ్చి విమానం ఎక్కాడు. ఆయన వెనక్కాల కారులో వచ్చిన సెక్యూరిటీ ఆఫీసర్ సాగర్ మాత్రం ఆ విమానం ఎక్కలేకపోయాడు. విమానం బాగు పడకపోయినా రాజీవ్ అవాళ్టికి బతికిపోయేవాడు. సాయంత్రం 6.30కు విమానం బయలుదేరింది. రాజీవ్ తను కాస్సేపు విమానం నడిపాడు. అదే చివరి విమానప్రయాణం అని తెలియదు కదా పాపం!

ఇక్కడ పెరంబుదూరులో బహిరంగసభకు ఆరు గంటలనుండి జనం రాసాగారు. వాళ్లకోసం శంకర్ గణేశ్ బృందం చేత ఓ సంగీత కార్యక్రమం ఏర్పాటు చేశారు. అక్కడ భద్రతా ఏర్పాట్ల విషయంలో చాలా నిర్లక్ష్యం వుంది. రాజీవ్ ఆ వూరికి వచ్చేవరకు ఆ రాత్రి మీటింగు తర్వాత ఆయన ఎక్కడ బస చేస్తాడన్న విషయమే ఆలోచించలేదు. చివరకు ఆ వూరిలో చాలాకాలంగా వాడకుండా వున్న ఓ టూరిస్టు బంగళాలో వుంచుదామనుకున్నారు. నిజానికి శివరాజన్ ముఠా మీటింగు దగ్గర అనుకున్నది చేయలేకపోతే టూరిస్టు బంగళాపై దాడి చేసేవారేమో ! అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించే బాధ్యత సీనియర్ ఐపియస్ అధికారి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆర్ కె రాఘవన్‌ది. ఆయన కింద పోలీసు సూపర్నెంటు నాంజిల్ కుమరన్ రాజీవ్ కిచ్చే పూలదండలను ఒక సబ్ యిన్‌స్పెక్టర్ చేత మెటల్ డిటెక్టర్ల సహాయంతో తనిఖీ చేయించే ఏర్పాటు చేశాడు కానీ బారికేడ్లు కట్టుదిట్టంగా కట్టించడం కానీ, వచ్చిపడే జనాలను అరికట్టడం కానీ, పవర్‌ఫుల్ లైట్లు పెట్టించడం కానీ పెట్టాలని మర్చిపోయారు.

మొత్తం మీద 300 మంది పోలీసు సిబ్బంది వున్నారు. జనం విరగబడి వచ్చినా తొక్కిసలాట జరగకుండా, ప్రశాంతంగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసు బలగాల మీద వుంది. వాళ్లలో ఒక సబ్ యిన్‌స్పెక్టరు అనసూయ. ఆమెను, మరో మహిళా కానిస్టేబుల్‌ను రాజీవ్ నడిచి వచ్చే ఎర్ర తివాచీ పరిధిలోకి వచ్చే మహిళా కార్యకర్తలను అదుపు చేయడం. అయితే వాళ్లను 'పూర్తిగా



తనిఖీ చేయాలి' అనే ఆదేశాలు వీళ్లకి లేవు. అలా చేయడానికి అవసరమైన మెటల్ డిటెక్టరూ లేదు ! భద్రతాపరమైన ఏర్పాట్లలో లోపాల గురించి జూన్ 1991 నాటి "ఇండియా టుడే" రేఖా చిత్రం చూడండి.

ఎర్ర తివాచీకి అటూ యిటూ కట్టిన కంచెలు – పోలీసు వారిచ్చిన స్టాండర్డ్స్‌కు అనుగుణంగా లేవు. కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలని గట్టిగా అంటే స్థానిక కాంగ్రెస్ నాయకుల నుంచి విపరీతమైన వ్యతిరేకత. ఈ రూల్సు అవీ వట్టి వేస్టు. వీటివలన నాయకులకు, ప్రజలకూ దూరం పెరుగుతుంది తప్ప ఒనగూడేది ఏమీ లేదు అని వాళ్ల అభిప్రాయం. సాక్షాత్తూ రాజీవ్ గాంధీయే అటువంటి అభిప్రాయంలో వున్నాడు.

కానీ అతనికి తెలియదు – అవేళ సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శ్రీలంక రాజధాని కొలంబోలోని భారత హై కమీషనర్ ఆఫీసుకి ఓ అజ్ఞాతవ్యక్తి ఫోన్ చేసి "రాజీవ్ గాంధీ యింకా బ్రతికే వున్నారా?" అని ఫోన్ చేశాడని. ఈ సమాచారం కనుక తక్షణమే భారత ప్రభుత్వంలోని భద్రతా విభాగానికి చేరి వుంటే, ఆ సభాస్థలంలో సెక్యూరిటీ ఏర్పాట్లు మరింత కట్టుదిట్టంగా చేసేవారేమో ! నిజానికి యీ ఫోన్ వచ్చేపాటికి శివరాజన్ ముఠా యింకా నళిని యింటి దగ్గర్నుంచి బయలుదేరలేదు. రాజీవ్ సాగరాంధ్ర ప్రాంతంలో వున్నారు. ఈ కుట్ర వ్యవహారం తెలిసిన ఆ అజ్ఞాత వ్యక్తి రాజీవ్‌పై జాలితో ఎందుకైనా మంచిది, జాగ్రత్త పడండి అని హెచ్చరిక చేశాడేమో ! కానీ అప్పుడు దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. హత్య జరిగాక అప్పుడు చెప్పారు, మాకు యిలా ఫోన్ వచ్చింది అని. అప్పుడు ఆ వ్యక్తి ఎవరా అని వెతకబోయారు. దొరకలేదు. ఇప్పటివరకు ఆ ఫోన్ కాల్ చేసినదెవరో బయటపడలేదు ! మిగతా కథ వచ్చే సోమవారం. (సశేషం) – **ఎమ్బీయస్ ప్రసాద్ (సెప్టెంబరు 2011)**